నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 3 జనవరి 2025 | KARIMNAGAR



..పక్క చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు నవీన్‌రావు. శంకరపట్నం మండలం ఎరడబెల్లి గ్రామం. రైతు కుటుంబం నుంచి వచ్చిన ఆ యువకుడు బీటెక్ పూర్తి చేసి, హైదరాబాద్‌లో ఇంటీరియర్ డెకొరేషన్ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల రియల్ ఎస్టేట్ రంగం కుదేలు కావడం, కొత్త నిర్మాణాలు తగ్గుముఖం పట్టడంతో అన్నింటి మాదిరిగానే సదరు వ్యాపారంపైనా ప్రభావం పడింది. దాంతో మరో స్వయం ఉపాధి కోసం ఆలోచించి, గ్రామంలో తనకున్న వ్యవసాయ స్థలంలో డెయిరీ ఫాం పెట్టుకోవాలని అనుకున్నాడు. అందుకోసం కొంత భూమిని నాలా కన్వర్షన్ చేయించడం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం చూస్తే.. మూడు నాలుగు రోజుల్లో ఈ పని కావాలి. ఇంకా అధికారులకు ప్రోత్సహించాలన్న తపన ఉంటే.. కేవలం ఒకటి రెండు రోజుల్లో కన్వర్షన్ చేసి, సర్టిఫికెట్ ఇవ్వచ్చు. కానీ, స్వయం ఉపాధి వైపు అడుగులు వేసిన నవీన్‌రావును వెన్నుతట్టాల్సిన ఆ మండల రెవెన్యూ అధికారులు, ₹10వేల లంచం ఇస్తేనే కన్వర్షన్ చేస్తామంటూ ఇబ్బంది పెట్టారు. దీంతో నవీన్‌రావు తీవ్ర మనస్తాపం చెందాడు. తనలా మరొకరు ఇబ్బంది పడొద్దని భావించాడు. ఆ మేరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి, వారి సూచన మేరకు ₹6వేల లంచం ఇస్తూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టించాడు. ఒక్క రెవెన్యూలోనే కాదు, మెజార్టీ ప్రభుత్వ విభాగాల్లో ఇదే అవినీతి దందా నడుస్తున్నది. లంచాలకు అడ్డుకట్ట వేయాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చినా.. అందులోని లొసుగులను ఆసరాగా చేసుకోవడం, లేకపోయినా కొత్తవి సృష్టించి లంచం తీసుకోవడం మెజార్టీ అధికారులకు అలవాటుగా మారింది. ఒక మాటలో చెప్పాలంటే.. లంచం ఇస్తేనే 70 శాతానికిపైగా పనులకు ఫైల్లు కదులుతున్నట్టు, లేకుంటే తిరకాసు పెడుతున్నట్టు తెలుస్తున్నది.

## కూలి రేట్ల పెంపు కోసం హమాలీల సమ్మె



పెద్దపల్లిలోని సివిల్ సప్లయీస్ గోదాం ఎదుట నినదిస్తున్న హమాలీలు

పెద్దపల్లి టౌన్, జనవరి 2: కూలి రేట్ల పెంపు కోసం పెద్దపల్లి సివిల్ సప్లయీస్ గోదాంలోని హమాలీ కార్మికులు సమ్మె చేశారు. గురువారం జిల్లాకేంద్రంలోని సివిల్ సప్లయీస్ గోదాం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు కడారి సునీల్ మాట్లాడారు. మూడు నెలల క్రితం ఒప్పందం చేసుకున్న కూలీ రేట్లు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం కూలీ రేట్లు ఇవ్వాలని సమ్మె నోటీసు ఇచ్చినా నేటి వరకు ఏలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. ఇక్కడ నాయకులు తిరుపతి, పూసాల రమేశ్, పోశమల్లు, లింగయ్య, సతీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# లంచగొండులపై యువత తిరుగుబాటు!






మన దేశంలో అడగడుగునా లంచం..
మున్సిపల్ నీళ్లు రావడానికి లంచం..
ఇల్లు కట్టడానికి లంచం.. కరెంటు ఇవ్వడానికి లంచం..
రేషన్‌కార్డుకు లంచం.. రేషన్ తీసుకోవడానికి లంచం..
రైతులకు రుణాలు ఇవ్వాలంటే లంచం..
రుణాలు కట్టలేని పరిస్థితుల్లో ఆస్తులను నిలుపుకోవాలంటే లంచం..
హాస్పిటల్లో బెడ్‌కు లంచం.. ఆడపడుచు సుఖంగా ప్రసవించడానికి లంచం
బర్త్, డెత్ సర్టిఫికెట్లకు లంచం.. మనిషి పుట్టిన దగ్గర నుంచి సచ్చే దాకా
**లంచం.. లంచం.. లంచం..**

..సమాజంలో పెరిగిపోతున్న అవినీతిపై ఠాగూర్ సినిమాలో మెగాస్టార్ చిరంజీవి చెప్పిన డైలాగ్ ఇది! 2003లో వచ్చిన ఈ మూవీ పెద్ద హిట్ కొట్టింది. అప్పట్లో అవినీతి నిర్మూలనపై పెద్ద చర్చే జరిగింది. ప్రజలను కొంతమేర చైతన్యం చేసినా.. మెజార్టీ అధికారుల్లో మార్పు తేలేకపోయింది. అందుకే యువత తిరుగుబాటు మొదలు పెట్టింది. గడిచిన నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 మంది అధికారులు ఏసీబీకి పట్టుబడగా, ఈ లంచగొండులను పట్టించిన వారిలో మాత్రం దాదాపు 73 శాతం మంది యువకులే ఉన్నట్టు ఏసీబీ డాటా ద్వారా తెలుస్తున్నది.

- చీడపురుగుల్లా మారుతున్న లంచగొండులు
- స్వయం ఉపాధివైపు మళ్లుతున్న యువతకు అడ్డంకులు
- ఠాగూర్‌లుగా మారుతున్న యువకులు
- అవినీతి అధికారుల భరతం పట్టేందుకు ముందుకు
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్న ఏసీబీ
- పట్టించిన వారిలో 73 శాతం మంది
- శిక్షలు, జరిమానాలు పడుతున్నా అవినీతి వైపే అక్రమార్కుల చూపులు

కరీంనగర్, జనవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ శంకరపట్నం : సమాజంలో అవినీతి జబ్బు మరింతగా పెరుగుతున్నది. ఏ పని చేయాలన్నా లంచం ఇవ్వనిదే ఫైలు కదపని పరిస్థితి ఉంటున్నది. కొంతమంది అధికారులు నీతి, నిజాయితీకి కట్టుబడి పని చేస్తున్నా.. మెజార్టీ అధికారులు మాత్రం పూర్తిగా బరితెగిస్తున్నారు. నిర్మొహమాటంగా డబ్బులు అడుగుతున్నారు. చివరకు చదువుకున్న యువతీ యువకులను కూడా వదలకుండా వసూలు చేస్తున్నారు. నిజానికి చదివిన చదువులకు తగిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక మెజార్టీ నిరుద్యోగులు కొన్నాళ్లుగా సాగుబాట పడుతున్నారు. డెయిరీ, కోళ్ల ఫారాలతోపాటు చిన్న చిన్న వ్యాపారాలు పెట్టుకొని, స్వయం ఉపాధి పొందుతున్నారు. ఇటువంటి వారిని ప్రోత్సహించి వెన్ను తట్టాల్సిన అధికారులు, ఆదిలోనే వారిని లంచాల కోసం జలగల్లా పీడిస్తున్నారు. దీంతో కడుపు మండుతున్న యువకులు.. సదరు అధికారులపై తిరుగుబాటు చేస్తున్నారు. అవినీతి నిరోధకశాఖ అధికారులను ఆశ్రయిస్తూ లంచగొండుల భరతం పడుతున్నారు.

**నాలుగేళ్లలో 40 మంది ఏసీబీకి వలలో..**


గడిచిన నాలుగేళ్ల కాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 40 మందికి పైగా అధికారులు ఏసీబీకి చిక్కడం పెచ్చుమీరుతున్న అవినీతికి అద్దం పడుతున్నది. ఒక్క 2024లోనే 14 మందిని పట్టుకోవడం కలకలం రేపింది. అంటే దాదాపు నెలకు ఒక అధికారి పట్టుబడుతున్నారు. ఈ డాటాను నిశితంగా పరిశీలిస్తే.. అవినీతి అధికారులను పట్టించిన వారిలో దాదాపు 73 శాతం మంది యువకులే ఉన్నారు. ఉద్యోగాలు లేక ఉపాధి వెదుక్కుంటున్న యువతకు సహకరించాల్సింది పోయి, వారి పనులకు లంచాలు అడుగడం యువకులను తీవ్ర మనస్థాపానికి గురిచేస్తున్నది. అధికారుల వ్యవహార శైలితో విసిగిపోయి గత్యంతరం లేని పరిస్థితుల్లో ఏసీబీని ఆశ్రయించి పట్టిస్తున్నట్టు స్పష్టమవుతున్నది.

**శిక్షలు పడుతున్నా అవినీతి వైపే..**

నిజానికి ఏసీబీ అరెస్టు చేసిన తర్వాత లంచగొండులకు న్యాయస్థానం జైలు, జరిమానాలు విధిస్తున్నది. కొంత మందికి నాలుగేళ్ల జైలుతోపాటు భారీ జరిమానాలు విధించిన సందర్భాలు కోకోల్లలుగా ఉన్నాయి. అయితే శిక్షలు పడుతున్నా లంచగొండి అధికారుల తీరులో ఏ మాత్రం మార్పు రావడం లేదు. నాలుగేళ్లలో పట్టుబడిన కేసులను చూస్తే రెవెన్యూ, పోలీస్ శాఖలు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖలో అవినీతి శ్రుతిమించుతున్నది. ఈ శాఖ పరంగా జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి'ని తెచ్చింది. అధికారులకు రికార్డులను ఆధునీకరించే అవకాశం ఇచ్చింది. వివరాలన్నీ కరెక్టుగా ఉంటే ఏ పనైనా సరే నిర్ధారిత సమయంలో పూర్తి చేసే అవకాశమున్నది. కానీ, అధికారులే చాలా భూములకు సంబంధించి తప్పుడు వివరాలు నమోదు చేశారు. అటువంటి వాటిని గుర్తించిన ప్రభుత్వం వాటి సవరణకు అనేక మార్గాలను కల్పించగా.. ఇదే అదునుగా కొందరు అధికారులు అడ్డదారులు తొక్కారు. క్షేత్రస్థాయి నుంచి నివేదిక తెప్పించి, బాధితులకు న్యాయం చేయాల్సిందిపోయి జలగల్లా లంచాలు గుంజుతున్నారు. వేలకు వేలు ఇవ్వాలని నిర్భయంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలి కాలంలో పట్టుబడుతున్న వారిలో రెవెన్యూ అధికారులే ఎక్కువగా ఉంటున్నారు. అంతేకాదు, ఉమ్మడి జిల్లాలోని ప్రతి ప్రజావాణిలోనూ వీరిపైనే అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయి. వీటితోపాటు కార్పొరేషన్‌లోనూ అక్రమ దందా అడ్డగోలుగా నడుస్తున్నది. ఏ నిర్మాణం అయినా సరే లచం ఇస్తే తప్ప అనుమతులు రావడం లేదు. కొన్ని స్టేషన్లలో సెటిల్‌మెంట్ పేరిట దందాలు నడుస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే లంచం ఒక మహమ్మారిలా మారింది.

**పట్టించండి ఇలా..**

సమాజంలో అవినీతికి అడ్డుకట్ట పడాలంటే ప్రతి ఒక్కరిలోనూ చైతన్యం రావాలి. అక్రమార్కుల భరతం పట్టాలంటే ప్రశ్నించేతత్వం, నిలదీసే తత్వంపెరగాలి. నిబంధనల ప్రకారం పనులు చేయకుండా ఏ అధికారి లంచం అడిగినా అవినీతి నిరోధకశాఖను సంప్రదించాలి. ఏసీబీ అధికారులు ఆ వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతారు. అలాగే బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తారు. ఇలా జరిగినప్పుడే మార్పు సాధ్యమవుతుంది.




**అవినీతిపై సమాచారం ఇవ్వాల్సిన ఫోన్ నంబర్లు**

టోల్ ఫ్రీ నంబర్ **1064**

**9154388954**
వీవీ రమణ (ఏసీబీ డీఎస్పీ) :

**9154388955**
తిరుపతి సీఐ

**91543 88956**
కృష్ణ కుమార్ సీఐ

**విద్యుత్ శాఖలోనూ..**

విద్యుత్ శాఖలోనూ లంచాల పర్వం కొనసాగుతున్నది. నగరంలోని ఖాన్‌పురకు చెందిన మహ్మద్ అబ్దుల్ హది అనే వినియోగదారుడు మూడు మీటర్ల కోసం దరఖాస్తు చేసుకోవడం, వాటి మంజూరు కోసం ₹15వేల లంచం ఇవ్వాలంటూ ఆ శాఖకు చెందిన లైన్‌ఇన్‌స్పెక్టర్ డిమాండ్ చేయడం.. అడిగింది ఇవ్వకపోవడంతో దరఖాస్తు రిజెక్టు చేయడం.. ఆ మేరకు ఆయన ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం ఇటీవల వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. ఇటువంటి వ్యవహారాలతో ఒకరిద్దరు కాదు, చాలా మంది బాధపడుతున్నారు. వీటిని అదుపులోకి తెచ్చేందుకు ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి, కొత్తగా ఫోన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చారు. లంచాలపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ చేసేందుకు ఆదేశాలు సైతం ఇచ్చారు.



**విద్యుత్‌శాఖలో అవినీతిపై సమాచారం ఇవ్వాల్సిన నంబర్లు**

సెల్ నంబర్ : **9281033233** | టోల్‌ఫ్రీ నంబర్ **1064**

యువకుడికి డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తున్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్



## తాగి నడిపితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు!

- రెండు లేదా మూడు సార్లు పట్టుబడితే రద్దుకు సిఫారసు
- డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలి
- రాజన్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : తాగి వాహనం నడుపుతూ డ్రంక్ పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్సు రద్దు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. డ్రంక్ అండ్‌డ్రైవ్‌లో రెండు లేదా మూడుసార్లు దొరికిన వాహనదారుల లైసెన్సు రద్దు చేయాలని సంబంధిత రవాణా శాఖకు సిఫారసు చేస్తామని చెప్పారు. సిరిసిల్ల ఆర్టీవో కార్యాలయంలో గురువారం పోలీస్, ఆర్టీవో శాఖలు సంయుక్తంగా నిర్వహించిన లైసెన్స్ మేళాలో ఆయన పాల్గొని, దరఖాస్తు చేస్తుకున్న యువకులకు లైసెన్సులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చాలా మంది డ్రైవింగ్ లైసెన్సు లేకుండానే వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారని, రోడ్డు భద్రతపై అవగాహన లేక ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి సమయాల్లో లైసెన్సు లేకపోతే ప్రమాద బీమా వర్తించదని చెప్పారు. అందుకే 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఉండాలన్న ఉద్దేశ్యంతో లైసెన్స్ మేళాకు శ్రీకారం చుట్టామని తెలిపారు. దరఖాస్తుదారులకు ఆన్‌లైన్ డ్రైవింగ్ పరీక్షలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి నిర్ణీత రుసుముతో లైసెన్సు ఇస్తున్నామన్నారు. మొదటి విడుత మేళాలో వంద మందికి డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేశామని చెప్పారు. ఇప్పుడు రెండో విడుత మేళాలో 700 మంది యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. తొలివిడుత వివిధ పోలీస్ స్టేషన్ల నుంచి వచ్చిన 30మందికి లర్నింగ్ లైసెన్సులు అందజేశామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, శ్రీనివాస్, డీటీవోలు లక్ష్మణ్, వంశీధర్, రజనీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


## తలనీలాలకు పహారా!



ఆరబోసిన తల నీలాల వద్ద బందోబస్తుగా ఉన్న పోలీస్

వేములవాడ రాజన్న ఆలయంలో తలనీలాల సేకరణ హక్కులు పొందిన కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్ నుంచి నగదు చెల్లించడం లేదు. డిసెంబర్ వరకే సుమారు ₹6 కోట్ల 75 లక్షలు బాకీ కట్టాల్సి ఉన్నది. దాంతో కల్యాణకట్టలో నిల్వ ఉంచిన తలనీలాలను అధికారులు స్వాధీనం చేసుకొని భద్రపరుస్తున్నారు. పదకొండు డబ్బాల్లో నిల్వ ఉన్న సుమారు రూ.కోటికిపైగా విలువైన తలనీలాలను గురువారం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌పై ఆరబెట్టి, భద్రత కోసం ఇద్దరు కానిస్టేబుళ్లను పహారా ఉంచారు. అయితే ఈ రక్షణ ఎందుకనేగా మీ అనుమానం? తలనీలాలు కిలోకు మార్కెట్‌లో వేలల్లో ధర పలుకుతుండగా.. ఆ మాత్రం భద్రత ఉండదా..! **- వేములవాడ, జనవరి 2**

కరీంనగర్‌లో ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న సిబ్బంది (ఫైల్)



- సమగ్ర సర్వే ముగిసి నెలన్నర దాటినా జరగని చెల్లింపులు
- ముందుగా నేరుగా అందించేందుకు ఏర్పాట్లు
- ఇటీవల ఎంపీడీవోల ద్వారా పంపిణీకి ఆదేశాలు
- ప్రభుత్వ నిర్ణయాలతో జాప్యమవుతున్న జమ
- రెమ్యూనరేషన్ కోసం సిబ్బంది ఎదురుచూపులు

## సర్వే చేయించారు.. పారితోషికం మరిచారు!

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ఇంకా పారితోషకం అందలేదు. నెలన్నరగా ఎదురుచూస్తున్నా ఖాతాల్లో పడలేదు. సర్వే పూర్తయిన వెంటనే సిబ్బంది ఖాతాల్లో నేరుగా జమ చేసేందుకు ప్రభుత్వం మొదట నిధులు విడుదల చేసినా.. ఆ తర్వాత నిలిపివేసింది. నాలుగు రోజుల క్రితం ఎంపీడీవోల ద్వారా పంపిణీకి ఆదేశాలు ఇచ్చినా.. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు మరికొద్ది రోజులు పట్టనున్నది. దీంతో సర్వే సిబ్బందిలో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.

కరీంనగర్ కలెక్టరేట్, జనవరి 2 : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల కులాలకు చెందిన వారి రిజర్వేషన్లు పెంచుతామని చేసిన ప్రకటన మేరకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్‌లో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు 10వేలకుపైగా సిబ్బందిని సర్వే కోసం వినియోగించుకున్నది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 2,742 మంది ఎన్యూమరేటర్లు, 252 మంది సూపర్‌వైజర్లు, 2,256 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లు విధులు నిర్వర్తించారు. అందులో వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీవోలతోపాటు పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులు ఉన్నారు. వీరంతా గత నవంబర్ 9 నుంచి 24 వరకు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఆయా కుటుంబాల సమాచారాన్ని ప్రత్యేకంగా ముద్రించిన ఫాంలలో నమోదు చేశారు. ఎలాంటి తప్పొప్పులూ లేకుండా క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం సర్వే వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేసేందుకు డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. వారు కూడా నిర్దేశించిన గడువులోపే అప్‌లోడ్ చేశారు. అప్పగించిన సర్వేను గడువులోపే విజయవతంగా పూర్తి చేసినా, పారితోషికం విడుదల చేయడంలో జాప్యం జరుగుతున్నది. నిజానికి సర్వేలో పాల్గొన్న ఎన్యూమరేటర్లు ఒక్కొక్కరికి ₹10వేలు, సూపర్‌వైజర్లకు ₹12 వేలు, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ప్రైవేట్ వ్యక్తులైతే ఒక్కో షిఫ్టుకు ₹750, ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహించే కాంట్రాక్టు ఆపరేటర్లకు ₹350 చొప్పున అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే ప్రారంభానికి ముందే నిధులు విడుదల చేసింది. పూర్తి కాగానే సిబ్బంది ఖాతాల్లో జమచేయాలని సూచించింది. అందుకనుగుణంగా చెల్లించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధం కాగా, ప్రభుత్వం అంతలోనే పాత ఉత్తర్వులు పక్కన పెట్టింది. మండలాల వారీగా సర్వే సిబ్బంది వివరాలు సేకరించి, వారికి చెల్లించాల్సిన మొత్తం ఎంపీడీవోల ఖాతాల్లో జమచేయాలంటూ నాలుగు రోజుల క్రితం (డిసెంబర్ 30న) ఆదేశాలు జారీ చేసింది. అలాగే సర్వే సిబ్బంది నుంచి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను మండల పరిషత్ ద్వారా సేకరించి, వారి ఖాతాల్లో జమ చేయాలని సూచించినట్టు తెలుస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు మరో పది రోజులు పట్టనున్నట్టు తెలుస్తుండగా, సర్వే సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీరుతో పారితోషికం అందించడంలో జాప్యం జరుగుతున్నదని మండిపడుతున్నారు. సర్వే పూర్తి చేసి నెలన్నర దాటుతున్నా ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే సిబ్బంది ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేస్తున్నారు.




మాస్కులు ధరించి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

## సీఎం, మంత్రుల మాస్కులతో ర్యాలీ

24వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షలు

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 2 : తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు దీక్షలు చేస్తూనే ఉన్నారు. గురువారం 24వ రోజుకు చేరుకోగా.. సిరిసిల్లలో వినూత్నంగా నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ ముఖాల మాస్కులు ధరించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి రగుడు అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. దారిపొడవునా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఉదయం విప్ ఆది శ్రీనివాస్‌ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. 24 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్, తదితరులు

## ఎస్‌యూకి ఎంఫార్మసీ కళాశాల!

కమాన్‌చౌరస్తా, జనవరి 2 : శాతవాహన యూనివర్సిటీకి ఎంఫార్మసీ కళాశాల మంజూరుకు ఏర్పాటు కాబోతున్నది, ఇంజినీరింగ్, లా కళాశాలలతోపాటే ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వీసీ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీ కాఫెరెన్స్ హాల్‌లో గురువారం విద్యాలయం నూతన క్యాలెండర్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, పరీక్షల నియంత్రణ అధికారి శ్రీరంగ ప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, యూనివర్సిటీ మంజూరైన కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం అమలులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. యూనివర్సిటీలో ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు. ఇక్కడ యూనివర్సిటీ ప్లేస్‌మంట్ ఇన్‌చార్జి మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు కిశోర్, ప్రసాద్, వివిధ విభాగాల ప్రిన్సిపాళ్లు రవికాంత్, జయంతి, సుజాత, స్పోర్ట్స్ కార్యదర్శి మునవరొద్దీన్, పీడీ విజయ్ కుమార్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.